చెప్పండి? బాలింత చాలింత అయినప్పుడు ఇంట్లో పెద్దదిక్కులేక మగవాళ్లు చేసుకొంటుంటే చూడలేక నానా బాధా పడ్తున్నాననుకోండి. నాక్కాని మీవంటి అత్తగారుంటేనా! కళ్ళకద్దుకొని ఇంట్లో ఉంచుకొందును" అంది లలిత.

లలిత ఆ మాట ఏదో ముఖప్రీతి కోసం అనలేదు. రాజమ్మని చూస్తుంటే, వాళ్ళ ఇంటి విషయాలు వింటూంటే నిజంగా ఆమె పట్ల తనకి పూజ్యభావం కలిగింది. ఇంత మంచి మనిషిని పట్టుకొని ఆ పెద్దకోడలు నిర్లక్ష్యంగా మాట్లాడ్డం, ఆ కొడుకు వినీ విననట్లు పట్టించుకోకుండా ఊరుకోవడం లలితకి నచ్చలేదు. "ఈ కాలం పిల్లలే అంతండి. పెద్దా, చిన్నా, మంచీ మర్యాదా అన్నది బొత్తిగా లేకుండా పోతున్నది" అంది, అక్కడికి తనేదో పూర్వకాలానికి చెందిన మనిషిలా.

"కాలానిదేముందమ్మా మనిషి మనసులో ఉంది కాని, నువ్వు ఈ కాలం పిల్లవు కావూ? నేనెవరో నా సంగతి ఏమిటో తెలియకముందే "మామ్మగారూ" అంటూ నోరారా ఎంత మర్యాదగా పలకరించావు. నిన్ను చూస్తుంటే నాకేమనిపిస్తున్నదో తెలుసునా? ఎన్ని ఊళ్లు తిరిగైనా మా మూడో వాడికి నీలాంటి అమ్మాయి దొరికితే తెచ్చి పెళ్ళి చేసి, మా వారు రిటైరు అయిపోయాక వాళ్ళ దగ్గర ఉండిపోదామని..."

రైలు తన మానాన తను ప్రయాణిస్తుంటే లలిత, రాజమ్మల మధ్య మాటా, మంచీ కష్టం, సుఖం అలా చాలాసేపటి వరకు సాగిపోయింది. ఆ రాత్రి తమతోపాటు ఆవిడ భోజనానికి కూడా లలితే డబ్బు యిచ్చింది. ఆమె పర్స్‌లోంచి డబ్బు తీస్తుంటే కన్నార్పకుండా అటే చూసిన రాజమ్మ బేరర్ అటు వెళ్ళగానే, "అమ్మాయి! ఏమో అనుకొన్నాను కానీ నీకు నిజంగా ప్రయాణం చెయ్యడం తెలియదు. ఎవరైనా అంత సొమ్ము అలా పర్సులో పెట్టుకొంటారా? దారి ఖర్చులకు పదో పాతికో పరకో దగ్గర వుంచుకుని మిగతాది పెట్టెలో పెట్టేయి. ఇందాక నువ్వు అందులోంచి డబ్బు తీస్తుంటే ఆ బేరర్‌గాడి కళ్ళన్నీ ఆ పర్సు మీదే వున్నాయి. ఏ వేళకి ఎవరికి ఏ బుద్ధి పుడుతుందో ఎవరు చెప్పగలరు?" అంది.

రాజమ్మ సలహా మీద తన మెడలో ఉన్న నెక్లెసు పిల్లల మెడలో ఉన్న గొలుసులు ఇంకా చిన్నా చితకా బంగారు వస్తువులు అన్నీ తీసి పెట్టెలో భద్రపరిచింది లలిత.

ఆ రాత్రి ప్రయాణం ఎటువంటి చికాకులు లేకుండా సుఖంగానే జరిగిపోయింది. ఆ తల్లీకూతుళ్లు విజయవాడలో దిగిపోయాక ఒక అమ్మాయి, అబ్బాయి పెట్టెలోకి ఎక్కారు. వాళ్లు నూతన దంపతుల్లా ఉన్నారు. పెట్టెలో తాము కాక మరో ఇద్దరు ప్రయాణీకులు ఉన్నారన్న ధ్యాసే వారికి ఉన్నట్లు లేదు. ఏదో గుసగుస లాడుకొంటూ ఉండడం, కిసకిస నవ్వు కొంటుండడం వాళ్ళ లోకంలో వాళ్ళున్నారు.

వాళ్ళు ఎవరు? ఎంత దూరం వెళ్తారు వంటి విషయాలు లలిత పట్టించుకోలేదు. తన పక్కన అంత పెద్ద రాజమ్మ భరోసా ఉన్నాక ఎవరు ఎక్కడ ఎక్కినా, దిగినా అసలు

చేతిలో హేండ్ బ్యాగ్, ఇంకో చేతిలో సిగరెట్టు. రాజమ్మ ముఖానికి ఆ పందుజుత్తు ఎలా నప్పలేదో ఈమె కట్టుబొట్టుకి చేతిలో సిగరెట్టు, కత్తిరింపు జుత్తు అలాగే నప్పలేదు.

లలిత అలా పరిశీలనగా ముందుకు వంగి చూడ్డం గమనించిన ఎదుటి బెంచీ మీద అమ్మాయి. "సరిగ్గా ఆవిడలాగే ఉందికదూ?" అంది. అంతలోనే "అదిగదిగో ఆ అబ్బాయే ఆవిడ కోసం వచ్చింది" అంది.

రైలు వేగం అందుకుంది. కదుల్తున్న రైల్లోంచి క్షణకాలం అతడి వంక చూసింది లలిత. ఆ కుర్రాడు మద్రాసు ప్లాటుఫారం మీద రాజమ్మతో తిరిగిన కుర్రాడిలా కనిపించాడు. అతడు తన రెండో కొడుకని చెప్పింది రాజమ్మ. ఈ రైలులో కొడుకు కూడా వస్తున్నట్లు ఆవిడ చెప్పలేదు. మరి ఇది ఎలా సాధ్యపడింది? ఆ పిల్లడు అక్కడే ఉండిపోయాడు కదా అనుకొంది.

అర్థాంతరంగా రాజమ్మ అలా దిగిపోవడంతో లలిత కథ మళ్లా మొదటికొచ్చింది. ఢిల్లీ స్టేషనులో అన్నయ్య రాకపోతే ఏం చెయ్యడం? ఎలా ఇల్లు చేరడం అన్న బెంగ పట్టుకుంది. ఆ బెంగతో మిగిలిన ప్రయాణం అయోమయంగానే సాగిపోయింది. ఎక్కడ ఎవరు ఎక్కుతున్నారు, ఎవరు దిగుతున్నారు అన్నది పట్టించుకోకుండా తన ఇద్దరు పిల్లల్ని పక్కన పెట్టుకుని సామానులు చూసుకుంటూ క్షణమో యుగంలా గడుపుకొచ్చింది.

లలిత అదృష్టం బాగుంది. న్యూఢిల్లీ స్టేషనులో రైలు ఇంకా తిన్నగా ఆగకముందే అన్నగారి ముఖం కంటపడింది. మనసులోంచి కొండంత బరువు దిగిపోయినట్లని పించింది. "అన్నయ్యా!" అంటూ ఉత్సాహంగా చేయి ఊపుతూ కేక పెట్టింది.

చాలాకాలం తరువాత కలుసుకున్న అన్నా చెల్లెలు దారిపొడుగునా ఏవేవో విషయాలు ఉత్సాహంగా చెప్పుకుంటూనే ఉన్నారు. స్నానం పానం అయి కాస్త తెరిపిన పడ్డాక ఇంటి విషయాలు, భర్త రాలేకపోవడానికి కారణాలు. తన ప్రయాణ వివరాలు ఒకటొకటిగా చెప్పుకొచ్చింది లలిత. అలా విషయాలన్నీ వివరంగా చెప్తుంటే నాగపూర్ వరకు సాయం వచ్చిన రాజమ్మ సంగతి మాటల్లోకి వచ్చింది.

"మనిషిని పోలిన మనుషులుంటారని కథల్లో చదవడం, సినిమాల్లో చూడ్డం తప్పిస్తే ఇంతవరకు అటువంటి సంఘటన నా అనుభవంలోకి రాలేదు" అంది.

"రండర్రా పిల్లల్లారా! అత్తయ్య మంచి కథ చెప్తున్నది" అంటూ కేక పెట్టింది హైమ.

"కథ కాదే మేనకోడలా! కళ్లతో చూసిన విషయం" అంటూ మద్రాసులో రాజమ్మ రైలెక్కింది మొదలుకొని నాగపూర్ స్టేషన్‌లో రాజమ్మ పోలికలున్న బాబ్డ్ హెయిర్ పిల్లని చూసేదాకా జరిగిన సంగతులన్నీ వివరంగా చెప్పింది.

అంతా విని, "నిజం?" అంటూ ఆశ్చర్యపోయింది వదినగారు.

"నిజం కాక కథలు, కాకరకాయలు కల్పించి చెప్పడానికి నేను రచయిత్రిని కాను" అంది లలిత.

